సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
మంగళవారం । 12 । డిసెంబర్ । 2023



మాదిగలను గుర్తించింది సీఎం జగనే


స్వాతంత్య్రం వచ్చిన తరువాత మాదిగలకు సామాజిక, రాజకీయ గుర్తింపు లభించింది సీఎం జగన్ ప్రభుత్వంలోనేనని రాష్ట్ర మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. - 8లో



అన్నదానానికి విరాళం

సామర్లకోట: బాలాత్రిపురసుందరీ సమేత కుమారా రామ భీమేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదానా నికి భక్తురాలు కాదా సీత సోమవారం రూ.లక్ష విరా ళాన్ని ఈఓ టీవీ సూర్యనారాయణకు అందజేశారు.

తూర్పు డెల్టాకు నీరు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం తూర్పు డెల్టా కాలువకు 600 క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. మధ్య, పశ్చిమ డెల్టా కాలువలకు నీటి విడుదలను నిలిపివేశారు. సముద్రంలోకి 12,124 క్యూసెక్కుల మిగులు జలాలను విడిచిపెట్టారు.

న్యూస్‌రీల్

పోలీస్ 'జగనన్నకు చెబుదాం'కు 30 అర్జీలు



అర్జీదారుల ఫిర్యాదును పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీధర్

అమలాపురం టౌన్: జిల్లా ఎస్పీ కార్యాలయం లో సోమవారం జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 30 అర్జీలు వచ్చాయి. ఎస్పీ సుసరాపు శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా ఈ కార్యక్రమం వేర్వేరుగా నిర్వహించి, ఫిర్యాదులు స్వీకరించారు. అమలాపురం ఎస్కేబీఆర్ కళాశాల ఎదురుగా 216 జాతీయ రహదారి చెంతన దేవస్థానం స్థలాన్ని లీజుకు తీసుకుని పెట్రోలు బంక్ ఏర్పాటు చేయడం తమకు ప్రమాదకరంగా, అసౌకర్యంగా ఉంటుందని స్థానికులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. బంక్ నిర్మాణాన్ని అడ్డుకోవాలని అభ్యర్థించారు. ఎక్కువగా ఆస్తి, భూమి వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులే ఉన్నాయి. వీటిలో కొన్నింటిని ఎస్పీ శ్రీధర్ అక్కడికక్కడే పరిష్కరిస్తూ, సంబంధిత ఎస్సైలతో మాట్లాడి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కార్యాలయం స్పెషల్ బ్రాంచి సీఐ రాజశేఖర్ కూడా పాల్గొన్నారు.

స్పందనకు 219 అర్జీలు



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న జేసీ నుపూర్ అజయ్

అమలాపురం రూరల్: కలెక్టరేట్ గోదావరి భవన్‌లో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం – స్పందన కార్యక్రమంలో వివిధ సమస్యలపై 219 మంది అర్జీలు సమర్పించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్, డీఆర్ఓ సీహెచ్ సత్తిబాబు అర్జీలు స్వీకరించారు. వీటికి సంతృప్తికర పరిష్కారం చూపాలని ఈ సందర్భంగా జేసీ నుపూర్ అజయ్ అధికారులను ఆదేశించారు. అధికారులు తమ లాగిన్‌కు వచ్చిన అర్జీలను 24 గంటల్లోగా ఓపెన్ చేసి, సంబంధిత క్షేత్ర స్థాయి అధికారులకు పంపించి, త్వరితగతిన నాణ్యతతో పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

11 నుంచి టీకాల ప్రత్యేక శిబిరాలు

అమలాపురం టౌన్: మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో భాగంగా ఈ నెల 11 నుంచి 16వ తేదీ వరకూ జిల్లా వ్యాప్తంగా మూడో విడత ప్రత్యేక వ్యాధి నిరోధక టీకాల శిబిరాలు నిర్వహించనున్నారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బీవీవీ సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోలేని వారు ఈ శిబిరాలకు వెళ్తే టీకాలు వేస్తారని పేర్కొన్నారు. గ్రామాల వారీగా ఆయా అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు హై రిస్క్ ప్రాంతాల్లో ఈ ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఐదేళ్ల లోపు పిల్లలు, గర్భిణులకు ఈ టీకాలు వేస్తారని పేర్కొన్నారు.

నయనానందకరం శివపార్వతుల కల్యాణం



శివపార్వతులకు గంగానదీ జలాలతో కూడిన పంచామృతాభిషేకాలు చేస్తున్న స్వామి

కాకినాడ రూరల్: రమణయ్యపేటలోని శ్రీపీఠంలో గత నెల 14న తలపెట్టిన మహాశక్తి యాగం సోమవారం 28వ రోజుకు చేరింది. ఇప్పటికే 100 కోట్ల లలితా కుంకుమార్చనలు పూర్తయ్యాయి. సోమవారం సాయంత్రానికి కోటి బగళాముఖి జపాలు కూడా పూర్తయ్యాయి. కార్తిక మాసం చివరి సోమవారం, మాస శివరాత్రి కావడంతో యాగం వేదికగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నయనానందకరంగా నిర్వహించారు. ఉదయం నక్షత్ర శాంతి పూజలు, లలితా కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం గంగానది ఏడుపాయల నుంచి సేకరించిన పవిత్ర జలాలతో శివపార్వతులకు పరిపూర్ణానంద స్వామీజీ పంచామృత జలాభిషేకం, శాస్త్రోక్తంగా మంగళస్నానం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. చాగంటి స్వస్థలం కాకినాడ కావడం గర్వకారణమని, ఆయనకు పద్మశ్రీ పురస్కారం లభించాలని స్వామీజీ ఆకాంక్షించారు.

పక్కాగా లెక్క

- మిచాంగ్ తుపాను పంట నష్టాల నమోదుకు శ్రీకారం
- క్షేత్ర స్థాయిలో కమిటీల పర్యటన
- 18 వరకూ నమోదు
- 18 నుంచి 24 వరకూ సోషల్ ఆడిట్
- నష్టపోయిన ప్రతి రైతుకూ న్యాయం చేసేందుకు చర్యలు



అల్లవరం మండలం కోడూరుపాడులో వరి పంట నష్టాన్ని నమోదు చేస్తున్న వ్యవసాయ అధికారులు

సాక్షి, అమలాపురం: ప్రకృతి వైపరీత్యాలకు పంట నష్టపోయిన అన్నదాతకు అండగా నిలబడాలనే ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా జిల్లా యంత్రాంగం పంట నష్టాల నమోదుకు శ్రీకారం చుట్టింది. పంట నష్టపోయిన రైతులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నెల రోజుల్లోనే పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ) అందిస్తున్న విషయం తెలిసిందే. ఇందుకు అనుగుణంగా మిచాంగ్ తుపాను ప్రభావంతో జిల్లాలోని వ్యవసాయ, ఉద్యాన, వాణిజ్య పంటలకు కలిగిన నష్టంపై ఇప్పటికే ప్రాథమిక అంచనాలు రూపొందించిన అధికారులు.. ఇప్పుడు పక్కా లెక్కలకు తెర తీశారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి పంట నష్టాల నమోదు గ్రామాల వారీగా చేపట్టారు.

మిచాంగ్ తుపాను ప్రభావంతో ఈ నెల మూడు నుంచి ఆరో తేదీ వరకూ భారీ వర్షాలు కురిశాయి. కుండపోత వర్షాలతో వ్యవసాయ, ఉద్యాన, వాణిజ్య పంటలకు నష్టం జరిగింది. అత్యధికంగా ఖరీఫ్ వరి పంటకు నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే. తుపాను సమయానికి జిల్లావ్యాప్తంగా 51,608 ఎకరాల్లో వరి కోతలు జరగాల్సి ఉంది. సుమారు 15 వేల ఎకరాల్లో చేలు పడిపోగా, 12 వేల ఎకరాల్లో ముంపు బారిన పడ్డాయని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. నాలుగు రోజులుగా వర్షాలు లేకపోవడం, ముంపు నీరు దిగుతూండటం, తడిసిన ధాన్యాన్ని ఎండబెట్టడం వంటి చర్యల వల్ల పంట నష్టం చాలా వరకూ తక్కువగా ఉండనుంది.

తూర్పు డెల్టాలోని రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో దాదాపు 80 శాతం కోతలు పూర్తయ్యాయి. అయితే, ఇక్కడ మిగిలిన పంట, నిల్వ చేసిన ధాన్యం తడిసిపోవడం వల్ల రైతులు నష్టపోయారు. మధ్య డెల్టాలోని కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు, అమలాపురం, ముమ్మిడివరంలో పంట నష్టం అధికంగా ఉంది. ఇక్కడ వరి కోతలు కనీసం 40 శాతం కూడా పూర్తి కాలేదు. కొత్తపేట, పి.గన్నవరం, అమలాపురం, అయినవిల్లి, రాజోలు, మామిడికుదురు మండలాల్లో అరటి, కంద వంటి ఉద్యాన పంటలకు సైతం నష్టం వాటిల్లింది.

నష్టాల నమోదుకు కమిటీలు

పంట నష్టాలను క్షేత్ర స్థాయిలో పూర్తిగా పరిశీలించి, పక్కాగా నమోదు చేసేందుకు అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది. దీనికోసం గ్రామ, మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేశారు. వ్యవసాయ శాఖకు సంబంధించి విలేజ్ కమిటీలో వీఆర్ఓ, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, విలేజ్ సెక్రటరీ.. ఉద్యాన శాఖ కమిటీలో వీఆర్ఓ, విలేజ్ సెక్రటరీతో పాటు విలేజ్ హార్టికల్చర్ ఆఫీసర్ (వీహెచ్ఏ) సభ్యులుగా ఉంటారు. మండల స్థాయి కమిటీల్లో తహసీల్దార్, ఎంపీడీఓ, మండల వ్యవసాయ అధికారి, ఉద్యాన పంటలకు మండల ఉద్యాన అధికారి సభ్యులుగా ఉంటారు.



అయినవిల్లి మండలం తొత్తరమూడిలో ఉద్యాన పంట నష్టాల నమోదు



అంబాజీపేటలో పంట నష్టం నమోదు చేస్తున్న ఉద్యాన అధికారులు

మండపేట నియోజకవర్గం కపిలేశ్వరపురం మండలం కేదారిలంకలో 800 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేస్తుండగా.. 200 ఎకరాల్లో కూరగాయలు పండిస్తున్నారు. వర్షాలకు 60 ఎకరాలు దెబ్బతిన్నట్టు ప్రాథమిక నివేదికలో తేల్చారు. అద్దంకివారిలంకలో 600 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేస్తూండగా, ఇందులో 100 ఎకరాల్లో కూరగాయ పంటలున్నాయి. వీటిలో 40 ఎకరాలు దెబ్బతిన్నట్టు ప్రాథమికంగా గుర్తించారు. ఇటువంటి లెక్కలన్నీ ఇప్పుడు పక్కాగా తేల్చనున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో కె.గంగవరం మండలం దంగేరు, గంగవరంలోనూ, ముమ్మిడివరం నియోజకవర్గం ముమ్మిడివరం, కాట్రేనికోన మండలాల్లో పంట నష్టాల నమోదు మొదలవగా, ఐ.పోలవరం మండలం, రాజోలు, కొత్తపేట, పి.గన్నవరం నియోజకవర్గాల్లో మంగళవారం ఆరంభం కానుంది.

జిల్లాలో ఈ నెల 18వ తేదీ వరకూ పంట నష్టాలను క్షేత్ర స్థాయిలో పక్కాగా నమోదు చేయనున్నారు. వరికి సంబంధించి 33 శాతం పైబడి నష్టపోయిన చేలకు పూర్తి నష్టంగా నమోదు చేయనున్నారు. నష్టాల నమోదు అనంతరం 18 నుంచి 22వ తేదీ వరకూ సోషల్ ఆడిట్ నిర్వహించనున్నారు. పంట నష్టపోయిన రైతుల జాబితాను రైతు భరోసా కేంద్రాల్లో (ఆర్‌బీకే) ఉంచుతారు. రైతుల నుంచి అభ్యంతరాలు వస్తే స్వీకరించి, మరోసారి పరిశీలిస్తారు. తుది జాబితాను 24వ తేదీ నాటికి ప్రభుత్వానికి పంపించనున్నారు.

లెక్క తేలాక ప్రభుత్వానికి నివేదిక



మిచాంగ్ తుపాను కలిగించిన పంట నష్టాలను అంచనా వేయడానికి గ్రామ, మండల స్థాయిల్లో కమిటీలు ఏర్పాటు చేశాం. ఈ కమిటీలు వ్యవసాయ, ఉద్యాన పంటలకు వాటిల్లిన నష్టాలను నమోదు చేయనున్నాయి. లెక్క పక్కాగా తేల్చిన తరువాత ప్రభుత్వానికి నివేదిక పంపుతాము.

– ఎస్.నుపూర్ అజయ్, జాయింట్ కలెక్టర్

నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం



తుపాను వల్ల నష్టపోయిన ప్రతి రైతుకూ న్యాయం జరిగేలా పంట నష్టాల నమోదు పక్కాగా నమోదు చేయాలని గ్రామ, మండల కమిటీలకు సూచించాం. వారు క్షేత్ర స్థాయిలో పర్యటించి, పంట నష్టం నమోదు చేయనున్నారు. ఈ నెల 18వ తేదీ వరకూ పంట నష్టాల పరిశీలన, నమోదు జరుగుతాయి.

– ఎ.బోసుబాబు, జిల్లా వ్యవసాయ అధికారి

ద్రాక్షారామ క్షేత్రం.. జనసంద్రం

- భీమేశ్వరుని దర్శనానికి పోటెత్తిన భక్తులు
- లక్ష మందికి పైగా వచ్చారని అంచనా



శ్రీ భీమేశ్వరస్వామివారికి అభిషేకాలు నిర్వహిస్తున్న ఆలయ పురోహితులు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ శ్రీ మాణిక్యాంబ సమేత శ్రీ భీమేశ్వరస్వామి ఆలయం సోమవారం భక్తజన సంద్రమే అయ్యింది. పవిత్ర కార్తిక మాసం చివరి సోమవారం కావడంతో దాదాపు లక్ష మందికి పైగా భక్తులు తరలివచ్చారని అధికారులు అంచనా వేశారు. తెల్లవారుజాము నుంచే ఆలయ ప్రాంగణంలోని సప్త గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. తొలుత క్షేత్ర పాలకుడైన శ్రీ లక్ష్మీనారాయణస్వామిని, అనంతరం శ్రీ భీమేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. శ్రీ మాణిక్యాంబ అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్థలాల్లో కార్తిక నోములు ఆచరించారు. ధ్వజస్తంభం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రదేశాల్లో ఆవు నేతి దీపాలు వెలిగించారు. భక్తుల ఏర్పాట్లను ఈఓ పితాని తారకేశ్వరరావు పర్యవేక్షణలో స్థానిక, ఇతర ఆలయాల నుంచి వచ్చిన సిబ్బంది పర్యవేక్షించారు. రామచంద్రపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, సీఐ దుర్గారావు నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



ఆలయ ప్రాంగణంలో క్యూలైన్లలో కిక్కిరిసిన భక్తులు

లా నేస్తంతో యువ లాయర్లకు ఆర్థిక స్వావలంబన



వైఎస్సార్ లా నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, జేసీ నుపూర్ అజయ్ తదితరులు

అమలాపురం రూరల్: వైఎస్సార్ లా నేస్తం పథకం ద్వారా యువ న్యాయవాదులకు ఆర్థిక స్వావలంబన చేకూరుతుందని ఎమ్మెల్సీ, సీనియర్ న్యాయవాది కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. వైఎస్సార్ లా నేస్తం పథకం కింద రాష్ట్రంలోని జూనియర్ న్యాయవాదులకు ప్రతి నెలా రూ.5 వేల స్టైపెండ్ చెల్లించే కార్యక్రమాన్ని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాగా ఉన్న సమయంలో 38 మంది జూనియర్ న్యాయవాదులకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరిందని చెప్పారు. కోనసీమ జిల్లా ఏర్పడిన తర్వాత మరో 43 మంది కలిపి, మొత్తం 81 మంది యువ న్యాయవాదులకు లబ్ధి చేకూరుతోందని వివరించారు. అమలాపురానికి చెందిన యువ న్యాయవాది శ్రీనివాస్ మాట్లాడుతూ, తాను 2019 నుంచి వైఎస్సార్ లా నేస్తం ద్వారా లబ్ధి పొందుతున్నానని చెప్పారు. సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా వెనుకబడిన తరగతులకు చెందిన తాను, తన కుటుంబం ఎన్నో ప్రయోజనాలు పొందామని తెలిపారు. వైఎస్సార్ లా నేస్తం సాయం ఉన్నత చదువులతో పాటు, పోటీ పరీక్షలకు వెళ్లడానికి దోహదపడుతోందని వివరించారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు షేక్ ఖాదర్, కుడుపూడి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

'అముడా' అభివృద్ధికి రూ.5 కోట్లు

- పురపాలక మంత్రి సురేష్‌కు మంత్రి విశ్వరూప్ విజ్ఞప్తి
- అముడా, మున్సిపల్, టిడ్కో అధికారులతో మంత్రుల సమీక్ష

అమలాపురం టౌన్: కోనసీమ సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసిన అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అముడా) అభివృద్ధికి రూ.5 కోట్లు కేటాయించాలని పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌ను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ కోరారు. భట్నవిల్లిలోని విశ్వరూప్ నివాసంలో మున్సిపల్ అధికారులు, అముడా, టిడ్కో అధికారులతో మంత్రులు సోమవారం ఉదయం సమీక్ష సమావేశం నిర్వహించారు. అముడా, అమలాపురం మున్సిపాలిటీకి అవసరమైన అభివృద్ధి పనులపై అధికారులతో మంత్రి సురేష్ చర్చించారు. తొలుత మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ, అముడా అభివృద్ధికి నిర్దేశించిన సరికొత్త ప్రణాళిక అమలుకు ప్రత్యేక నిధులు అత్యవసరంగా కేటాయించాలని కోరారు. పట్టణంలో డంపింగ్ యార్డు స్థలం విషయంలో వస్తున్న ఇబ్బందులను మంత్రి సురేష్ దృష్టికి మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు తీసుకుని వెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి సురేష్.. తక్షణమే డంపింగ్ యార్డ్ కోసం 10 నుంచి 20 ఎకరాల స్థలం సేకరించాలని సూచించారు. ఈ భూమికి అయ్యే వ్యయాన్ని ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్ (టీడీఆర్) విధానంలో చెల్లించే ఏర్పాటు చేద్దామని పేర్కొన్నారు. అమలాపురం మాస్టర్ ప్లాన్ త్వరగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బోడసకుర్రులో నిర్మించిన టిడ్కో ఇళ్లకు సంబంధించి అనర్హులైన వారు, మధ్యలో డ్రాప్ అయిన వారికి అప్పటికే చెల్లించిన సొమ్ములు తిరిగి ఇవ్వాలని సంబంధిత అధికారులు మంత్రి దృష్టికి తీసుకుని వెళ్లారు. అముడాకు రూ.5 కోట్ల కేటాయింపు, టిడ్కో అనర్హులకు తిరిగి డబ్బులు చెల్లించడం, డంపింగ్ యార్డుకు స్థల సేకరణ తదితర అంశాలపై శాఖాపరంగా త్వరలోనే చర్యలు తీసుకుంటామని మంత్రి సురేష్ చెప్పారు. ఈ సమావేశంలో టిడ్కో డీఈఈ రాజు, అముడా ప్లానింగ్ అధికారి ఉమామహేశ్వరరావు, పబ్లిక్ హెల్త్ డీఈఈ గంగరాజు, టిడ్కో సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్ట్ డాక్టర్ డి.లలితకుమారి, మున్సిపల్ ఏఈ వెంకటేష్ పాల్గొన్నారు.




అధికారులతో చర్చిస్తున్న మంత్రులు పినిపే విశ్వరూప్, ఆదిమూలపు సురేష్

బాల వైజ్ఞానికులకు పండగే..

- 22, 23 తేదీల్లో జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన
- ప్రదర్శనకు 93 ప్రాజెక్టులు
- సిద్ధం చేస్తున్న జిల్లా సైన్స్ కాంగ్రెస్
- రామచంద్రపురంలో నిర్వహణ

రాయవరం: బాల వైజ్ఞానికుల పండగకు సర్వం సిద్ధమవుతోంది. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనను వెలికి తీయడమే లక్ష్యంగా ప్రభుత్వం బాలల సైన్స్ కాంగ్రెస్, ఇన్‌స్పైర్ మనాక్, జాతీయ సైన్స్ దినోత్సవం వంటి పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇప్పటికే జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ నిర్వహించిన విద్యాశాఖ.. త్వరలో పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు ఈ నెల 22, 23 తేదీల్లో రామచంద్రపురం శ్రీ కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జాతీయ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించనున్నారు. దీనికి జిల్లా సైన్స్ విభాగం సన్నద్ధమవుతోంది. అంతకు ముందు ఈ నెల 16న పాఠశాల స్థాయి, 19న మండల స్థాయిల్లో ఈ ప్రదర్శనలు జరపనున్నారు.



ఎవరెవరు పాల్గొనవచ్చునంటే..

ప్రతి పాఠశాల నుంచి వ్యక్తిగత, గ్రూపు, టీచర్ విభాగం నుంచి ఒక్కో ప్రాజెక్టును మాత్రమే తొలుత మండల స్థాయిలో ప్రదర్శించాలి. మండల స్థాయిలో సాధారణ పాఠశాలలతో పాటు, అటల్ ల్యాబ్ ఉన్న పాఠశాలలు కూడా ప్రత్యేకంగా పాల్గొనవచ్చు. అటల్ ల్యాబ్‌లో తయారు చేసిన ప్రాజెక్టులు మాత్రమే ప్రదర్శించాలి. అలాగే, జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో రాష్ట్ర స్థాయి ప్రదర్శనలో పాల్గొన్న ప్రభుత్వ పాఠశాల ప్రాజెక్టులను నేరుగా జిల్లా స్థాయికి నామినేట్ చేస్తారు. జిల్లా స్థాయిలో వ్యక్తిగత విభాగం, గ్రూపు, టీచర్స్ విభాగాల్లో ఒక్కో దాని నుంచి మూడు ప్రాజెక్టుల చొప్పున రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో అన్ని జిల్లాల నుంచీ వచ్చిన వ్యక్తిగత విభాగాలవి 15, గ్రూపు విభాగాలవి 10, ఉపాధ్యాయ విభాగానివి 10 కలిపి మొత్తం 35 ప్రాజెక్టులను రీజినల్ స్థాయికి పంపిస్తారు. రీజినల్ స్థాయిలో తొమ్మిది రాష్ట్రాల నుంచి పోటీ పడతారు. ఈసారి రీజినల్ స్థాయి పోటీలను విజయవాడలో వచ్చే నెల 19 నుంచి 23వ తేదీ వరకూ నిర్వహించనున్నారు.

ఉత్తర్వులు జారీ

పాఠశాల, మండల, జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలంటూ జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) ఎం.కమల కుమారి ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్కో మండలం నుంచి మూడు చొప్పున జిల్లావ్యాప్తంగా 66 ప్రాజెక్టులు ఎంపిక చేస్తారు. అలాగే 22 మండలాల నుంచి అటల్ ల్యాబ్స్ నుంచి, జిల్లా బాలల సైన్స్ కాంగ్రెస్ నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఐదు ప్రాజెక్టులు కలిపి మొత్తం 93 ప్రాజెక్టులను జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రదర్శిస్తారు. జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేసేందుకు డీఈఓ కమల కుమారి నేతృత్వంలో జిల్లా సైన్స్ అధికారి గిరజాల వెంకట సత్య సుబ్రహ్మణ్యం ఆధ్వర్యాన త్వరలోనే కమిటీలు ఏర్పాటు చేయనున్నారు.

గతానికి భిన్నంగా..

చదువు, ఆటలే కాదు.. విభిన్న అంశాలకు చెందిన ప్రాజెక్టుల రూపకల్పనలోనూ తాము తక్కువేమీ కాదని నిరూపించేందుకు విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. గతంలో కేవలం జిల్లా స్థాయిలోనే విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించేవారు. గత ఏడాది నుంచి ప్రభుత్వం పాఠశాల, స్కూల్ కాంప్లెక్స్, మండల స్థాయిల్లో కూడా ప్రదర్శనలు ఏర్పాటు చేసింది. నూతన ఆవిష్కరణలే ధ్యేయంగా విద్యార్థులు ప్రాజెక్టులు ప్రదర్శించాల్సి ఉంటుంది.

మూడు కేటగిరీల్లో..

విద్యా, వైజ్ఞానిక పోటీలను ప్రధానంగా మూడు కేటగిరీల్లో ఎనిమిది అంశాల్లో నిర్వహించనున్నారు. భౌతిక శాస్త్రం (పీఎస్), రసాయనిక శాస్త్రం (కెమిస్ట్రీ), గణిత, ఖగోళ, పర్యావరణ, జీవశాస్త్రాలతో పాటు ఇంజినీరింగ్ ఇన్ కంప్యూటర్ సైన్స్ అనే అంశాల్లో పోటీలు నిర్వహిస్తారు. విద్యార్థులు వ్యక్తిగతంగా లేదా గ్రూపుగా పోటీ పడవచ్చు. ఉపాధ్యాయులు వ్యక్తిగతంగా కూడా పోటీల్లో పాల్గొనే అవకాశముంది. ఉపాధ్యాయ విభాగంలో పోటీ పడేవారు ఎనిమిది అంశాల్లో ఏదో ఒకటి ఎంచుకుని ఒక ఉపాధ్యాయుడు మాత్రమే పాల్గొంటారు. వ్యక్తిగత విభాగంలో పోటీ పడే విద్యార్థులు ఎనిమిది అంశాల్లో ఏదో ఒకటి ఎంచుకుని గైడ్ టీచర్‌తో కలిసి పోటీ పడవచ్చు.

జాతీయ స్థాయిలో మెరిసేలా..



జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనకు నాణ్యమైన ప్రాజెక్టులను రూపొందించేందుకు ఉపాధ్యాయులు ప్రాధాన్యమివ్వాలి. జాతీయ స్థాయిలో మన జిల్లా మెరిసేలా, విద్యార్థుల్లోని సృజనాత్మకత ఆలోచనలు ప్రతిబింబించేలా ప్రాజెక్టులను రూపొందించాలి. దీనికి ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలి.

– గిరజాల వెంకట సత్య సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్స్ అధికారి, అమలాపురం

సృజనాత్మకతను వెలికి తీసేందుకు..



విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ప్రభుత్వం ఏటా విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తోంది. గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా పాఠశాల స్థాయి నుంచే వీటిని నిర్వహిస్తున్నాం. విద్యార్థుల్లోని మేధోసంపత్తికి పదును పెట్టేందుకు, ప్రతిభను వెలికి తీసేందుకు ఈ విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయి.

– ఎం.కమలకుమారి, డీఈఓ, అమలాపురం

సత్యదేవుని ఆలయానికి పోటెత్తిన భక్తులు



సత్యదేవుని దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు

అన్నవరం: కార్తిక మాసం చివరి సోమవారం కావడంతో సత్యదేవుని సన్నిధికి భక్తులు భారీగా తరలి వచ్చారు. ఆదివారం రాత్రికే సుమారు 10 వేల మంది భక్తులు రత్నగిరికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో భక్తుల రద్దీని తట్టుకునేందుకు స్వామివారి ఆలయాన్ని సోమవారం వేకువన ఒంటిగంటకే తెరిచారు. స్వామివారి వ్రతాలు కూడా ఆ సమయానికే ప్రారంభించారు. అనంతరం స్వామివారి దర్శనానికి భక్తులను అనుమతించారు. వేకువ ఒంటి గంట నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ ఆలయం ప్రాంగణం భక్త జనసందోహంతో నిండిపోయింది. రద్దీ కారణంగా అంతరాలయ దర్శనం టిక్కెట్ తీసుకున్న భక్తులను కూడా వెలుపల నుంచే దర్శనానికి అనుమతించారు. మధ్యాహ్నం వరకూ యంత్రాలయ ప్రదక్షిణ దర్శనాలను నిలిపివేశారు. సుమారు 15 వేల మందికి పులిహోర, దద్ధోదనం పంపిణీ చేశారు. సత్యదేవుని సుమారు 70 వేల మంది దర్శించారని అంచనా. 6,841 వ్రతాలు జరిగాయి. దీంతో కార్తిక మాసంలో ఇప్పటి వరకూ 1,25,659 వ్రతాలు జరిగాయి. ఆన్‌లైన్ వ్రతాలతో కలిపితే సంఖ్య 1,42,373కి చేరింది. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.60 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. వ్రతాల ద్వారానే సుమారు రూ.35 లక్షల మేరఆదాయం సమకూరింది. ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.19 లక్షలు వచ్చింది.

క్లుప్తంగా

సాగర తీరాన నేడు మహా కుంభాభిషేకం

కాకినాడ రూరల్: సాగర తీరాన శ్రీ మంగళాంబికా సమేత ఆదికుంభేశ్వర స్వామి ఆలయంలో 48వ మహా కుంభాభిషేకం మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. కార్తిక అమావాస్యను పురస్కరించుకుని కుంభాభిషేకం రేవు వద్ద ఆలయంలో కోటీ 8 లక్షల శివలింగాలకు అభిషేకం చేయనున్నారు. ఉదయం 7 గంటలకు గో పూజ, అనంతరం విఘ్నేశ్వర పూజ, వేద పఠనం, రసలింగేశ్వరునికి విబూదితో అభిషేకం చేస్తారు. అనంతరం అభిషేక విబూదిని సముద్రంలో నిమజ్జనం చేస్తారు. ఉదయం 9.38 గంటలకు కోటీ 8 లక్షల శివలింగాలకు, పాదరస లింగానికి మహా కుంభాభిషేకం నిర్వహిస్తారు. ద్వాదశ లింగాలకు బిల్వార్చన, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనం, ఆదికుంభేశ్వరస్వామికి బిల్వార్చన, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేపట్టనున్నారు. మధ్యాహ్నం లలితా సహస్ర నామాలలో కుంకుమార్చన, 3 గంటలకు మంగళాంబికా సమేత ఆదికుంభేశ్వర స్వామికి కల్యాణం, హోమం నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు 101 మంది కన్యలతో అభిషేక జలాలను సాగరంలో నిమజ్జనం చేయనున్నారు. మహా కుంభాభిషేకం కోసం కుంభాభిషేకం రేవును ముస్తాబు చేశారు.

మాదిగలను గుర్తించింది సీఎం జగనే

- ఈ ప్రభుత్వంలోనే చర్మకారులకు సంక్షేమం
- రాజకీయ ఆత్మీయ మహాసభలో మంత్రి ఆదిమూలపు సురేష్


సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మంత్రి సురేష్, ఎంపీ సురేష్, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ తదితరులు

అమలాపురం రూరల్: స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి గత 75 ఏళ్ల చరిత్రలో మాదిగలకు సామాజిక, రాజకీయ గుర్తింపు లభించింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనేని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. అమలాపురం పట్టణం శివారు కొంకాపల్లి సత్తెమ్మ గుడి ప్రాంగణంలో సోమవారం జరిగిన మాదిగలు, ఉప కులాల రాజకీయ ఆత్మీయ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మాదిగలకు రాజకీయంగా ప్రాధాన్యం ఇవ్వడమే కాకుండా, చర్మకారులకు జగన్ ప్రభుత్వంలోనే పెన్షన్ తదితర సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని గుర్తు చేశారు. ఇంతటి గుర్తింపునిచ్చిన ముఖ్యమంత్రి జగన్‌ను మాదిగలు జీవితాంతం గుర్తుంచుకుంటారని అన్నారు. మరో అతిథి, బాపట్ల ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ, సామాన్య కార్యకర్తనైన తనను ఓ ఎంపీగా పార్లమెంటుకు పంపించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందని అన్నారు. ఎమ్మెల్సీ, రాష్ట్ర మాదిగల పొలిటికల్ జేఏసీ చైర్మన్ బొమ్మి ఇజ్రాయిల్ మాట్లాడుతూ, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో గడచిన ఏడున్నర దశాబ్దాల చరిత్రలో ఏ రాజకీయ పార్టీ మాదిగలను చట్టసభలకు పంపించలేదని గుర్తు చేశారు. అటువంటి చరిత్రను ముఖ్యమంత్రి జగన్ తిరగరాస్తూ తనను ఎమ్మెల్సీగా ఎంపిక చేసి, శాసన మండలికి పంపించారని అన్నారు. లిడ్‌క్యాప్ చైర్మన్ కాకిమాను రాజశేఖర్, గుంటూరు జెడ్పీ చైర్‌పర్సన్ హెన్రీ క్రిస్టినా కూడా ప్రసంగించారు. అనంతరం అందరూ సహపంక్తి భోజనాలు చేసి ఆత్మీయతను, ఐక్యతను చాటారు. తొలుత సభా వేదికపై బాబూ జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు మంత్రి సురేష్, ఎంపీ సురేష్ పూలమాలలు వేసి, మహాసభను ప్రారంభించారు. ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞత చాటారు. అనంతరం మంత్రి సురేష్, ఎంపీ సురేష్‌లను ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ గజమాలలతో సత్కరించారు. ఇజ్రాయిల్ ఆధ్వర్యాన జరిగిన ఈ మహాసభలో మాదిగ నాయకులు చేట్ల సత్యనారాయణ, మడికి శ్రీరాములు, ఆకుమర్తి సత్యనారాయణ, లూటుకుర్తి సత్యనారాయణ, పెదపూడి ఏడుకొండలు, మోకాటి దుర్గారావుతో పాటు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా అధిక సంఖ్యలో మాదిగలు పాల్గొన్నారు.

కళా ఉత్సవ్ ఆరంభం


విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డైట్ అధ్యాపకులు


కళా ఉత్సవ్ పోటీల్లో అలరించిన విద్యార్థిని నృత్యం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా ప్రభుత్వ విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో సోమవారం కళా ఉత్సవ్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను డైట్ ప్రిన్సిపాల్ ఎస్‌డీవీ రమణ ప్రారంభించారు. రెండు రోజుల పాటు ఈ పోటీల్లో జరగనున్నాయి. తొలి రోజున ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని 13 ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు యాజమాన్య పాఠశాలల నుంచి 9, 10, 11, 12 తరగతుల విద్యార్థినీ విద్యార్థులు 20 మంది పాల్గొన్నారు. గాత్రం(సంగీతం, జానపద), వాయిద్య సంగీతం (వాయిద్యం, మెలొడీ), నాట్యం (సంప్రదాయ, జానపద) విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో ఉత్సాహంగా తమ ప్రతిభ చాటారు. మంగళవారం డ్రాయింగ్, మట్టిబొమ్మల తయారీ, సంప్రదాయ ఆటబొమ్మల తయారీ, ఏకపాత్రాభినయం పోటీలుంటాయని ప్రిన్సిపాల్ రమణ తెలిపారు.

తొలి రోజు విజేతలు వీరే..

బాలికల విభాగం: గాత్రం (జానపదం) ఎస్.రిత్వికాంజలి, ఎస్ఆర్ జూనియర్ కళాశాల, హుకుంపేట; వాయిద్య సంగీతం (మెలొడీ) జి.కృష్ణ సంహిత, ఆశ్రమ్ పబ్లిక్ స్కూల్, కాకినాడ; నృత్యం (క్లాసికల్) ఎస్.గీతా మాధురి, జెడ్పీ హైస్కూల్, కత్తిపూడి; నృత్యం (జానపదం) కె.మమత, పీఆర్ జూనియర్ కళాశాల) ప్రథమ స్థానాలు సాధించారు.

బాలుర విభాగం: వాయిద్య సంగీతం కె.కార్తికేయ, రవీంద్ర విద్యా నికేతన్, దానవాయిపేట), నృత్యం (జానపదం) జె.భానుప్రకాష్, జెడ్పీ హైస్కూల్, కడియం ప్రథమ స్థానాలు పొందారు. ఈ విజేతలు రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్ పోటీలకు ఎంపికయ్యారని రమణ తెలిపారు.

బదనికలకు జాతీయ స్థాయి గుర్తింపు

అంబాజీపేట: కొబ్బరితో పాటు వివిధ పంటలపై ఆశిస్తున్న తెగుళ్లను అరికట్టేందుకు వినియోగిస్తున్న జీవకారక నియంత్రణలకు (బదనికలు) జాతీయ స్థాయి గుర్తింపు వచ్చిందని కాసరగోడ్‌లోని సెంట్రల్ ప్లాంటేషన్ క్రాప్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీపీసీఆర్ఐ) ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ బి.అగస్టీన్ జెరార్డ్ అన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం, అఖిల భారత వన్య పంటల పథకం (ఏఐసీఆర్‌పీ) పరిశోధన ప్రగతిని పరిశీలించేందుకు అంబాజీపేటలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయానికి సోమవారం ఆయన వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బదనికలను వివిధ రాష్ట్రాల్లో వినియోగించేలా చూస్తామని అన్నారు. ఇక్కడి పరిశోధనలను ఆదర్శంగా తీసుకుని ఇతర రాష్ట్రాల్లో పరిశోధనలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారన్నారు. స్థానిక పరిశోధన కేంద్రంలో ఏఐసీఆర్‌పీ ఆన్ ఫామ్స్ పథకంలో నిర్వహిస్తున్న పరిశోధనలను, పరిశోధన కేంద్రం ప్రగతిని, బదనికల ప్రయోగశాలను నిశితంగా పరిశీలించారు. ప్లాంట్ పాథాలజీ, హార్టికల్చర్ విభాగాల్లో పరిశోధనలు, జీవనియంత్రణ ప్రయోగ శాల ప్రగతిని కేంద్రం అధిపతి ఎన్‌బీవీ చలపతిరావు, శాస్త్రవేత్తలు డాక్టర్ వి.గోవర్ధనరావు, బి.నీరజ, డాక్టర్ వి.అనూష, శాస్త్రవేత్త ఎ.కిరిటీ వివరించారు. రావేప్ విద్యార్థులు చేపడుతున్న వ్యవసాయ విధానాలను రోల్‌ప్లే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించారు. షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళికలో భాగంగా ఆ వర్గం రైతులకు అఖిల భారత వన్య తోట పంటల సమన్వయ పథకంలో భాగంగా సీపీసీఆర్ఐ అధికారులు కొబ్బరి మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా రైతులకు బదనికలు, ట్రైకోడెర్మా, బయో కంట్రోల్ ఏజెంట్లను పంపిణీ చేశారు. అనంతరం అగస్టీన్ జెరార్డ్‌ను చలపతిరావుతో పాటు శాస్త్రవేత్తలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీపీసీఆర్ఐ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎలైన్ అప్సర, శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.సుమిత, కొవ్వూరు ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ జి.రామానందం తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్‌లో అదరగొట్టిన 'వందన'

నాలుగు పతకాలు కైవసం


సాధించిన పతకాలతో వందన

అమలాపురం టౌన్/అల్లవరం: అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ (ఆసియా) పోటీల్లో అమలాపురం మద్దాలవారిపేటకు చెందిన పిల్లి వందన సత్తా చాటింది. ఒక రజత, మూడు కాంస్యం కలిపి ఏకంగా నాలుగు పతకాలు సాధించింది. మలేషియాలోని జోహోర్ బారూలో జరుగుతున్న 2023 ఏషియన్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఇండియా తరఫున వందన పాల్గొంది. సబ్ జూనియర్స్ 84 కేజీల కేటగిరీలో ఓవరాల్‌గా తృతీయ స్థానం కైవసం చేసుకుని కాంస్య పతకం సాధించింది. పవర్ లిఫ్టింగ్ స్క్వాట్ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం కైవసం చేసుకుంది. అలాగే బ్రెంచ్ ప్రెస్, డెడ్ లిఫ్ట్ విభాగాల్లో తృతీయ స్థానాలు సాధించి కాంస్య పతకాలు దక్కించుకుంది. అల్లవరం మండలం కొమరగిరిపట్నం గ్రామానికి చెందిన వందన తల్లిదండ్రులు వెంకటలక్ష్మి, సాయిబాబా అమలాపురంలో నివాసం ఉంటున్నారు. వెంకటలక్ష్మి దేవగుప్తం హైస్కూలులో టీచర్‌గా పని చేస్తున్నారు. సాయిబాబా ఇక్కడే ఒక ప్రైవేటు స్కూలులో పని చేస్తున్నారు. భీమవరంలోని ఒక ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న వందన.. అమలాపురంలోని హెల్త్ ఫిట్‌నెస్ జిమ్‌లో పవర్ లిఫ్టింగ్‌లో శిక్షణ పొందింది. అంతర్జాతీయ స్థాయిలో తన కుమార్తె విజయం సాధించడంతో వెంకటలక్ష్మి తన పాఠశాలలో స్వీట్లు పంచి సంబరాలు నిర్వహించారు. వందన ఈ నెల 16న మలేషియా నుంచి సొంతూరు అమలాపురం చేరుతుందని హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. వందనను జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు, జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు, కోశాధికారి దొమ్మేటి వెంకటరమణ అభినందించారు. పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కోనసీమ ప్రాంతానికి ఆమె ఓ గుర్తింపు తీసుకువచ్చారని పేర్కొన్నారు.

ప్రయాణికురాలికి బంగారం వస్తువు అందజేత


బంగారు వస్తువును యజమానికి అందజేస్తున్న డిపో మేనేజర్ షేక్ షబ్నం

రాజమహేంద్రవరం సిటీ: ఆర్టీసీ బస్సులో పోగొట్టుకున్న సుమారు రూ.1.20 లక్షల విలువైన రెండున్నర కాసుల బంగారు వస్తువును బాధితురాలికి రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో మేనేజర్ షేక్ షబ్నం సోమవారం అందజేశారు. వివరాలివీ.. సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవం గ్రామానికి చెందిన అడపా నాగమణి గత శనివారం సర్వీసు నంబర్ ఇ–601799 ఆర్టీసీ బస్సులో కాకినాడ నుంచి పెదబ్రహ్మదేవం గ్రామం వరకూ ప్రయాణించారు. బస్సు దిగేలోపు ఆమె మెడలో ఉన్న రెండున్నర కాసుల బంగారు పుస్తెలతాడు తెగి పడిపోయింది. బస్సు దిగిన వెంటనే పుస్తెలతాడు కనిపించకపోవడంతో డిపో అధికారులను సంప్రదించి, బస్సు కండక్టర్ బీయూ నాగమణి ఫోన్ నంబర్ తెలుసుకుని, నాగమణి సమాచారం అందించారు. బస్సులో ఆమె కూర్చున్న ప్రాంతంలో బంగారు వస్తువు ఉందని గుర్తించిన కండక్టర్.. దానిని రాజమహేంద్రవరం డిపోలోని లాస్ట్ పార్టీలో డిపాజిట్ చేశారు. తన బంగారు పుస్తెల తాడు బస్సులో పడిపోయిన విషయాన్ని ధ్రువీకరిస్తూ బస్ టికెట్, ఇతర వివరాలను నాగమణి తెలియజేశారు. ఈ మేరకు రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో మేనేజర్ షేక్ షబ్నం తన కార్యాలయంలో సిబ్బంది, సెక్యూరిటీ సమక్షంలో ఆ బంగారు వస్తువును నాగమణికి అందజేశారు.

వచ్చే నెలలో అంతర్జాతీయ తెలుగు మహాసభలు


ఆహ్వాన పత్రాలను ఆవిష్కరిస్తున్న చైతన్య రాజు

అమలాపురం రూరల్: వచ్చే నెల 5, 6, 7 తేదీల్లో రాజమహేంద్రవరం గైట్ విద్యా సంస్థల ప్రాంగణంలో అంతర్జాతీయ తెలుగు మహాసభలు నిర్వహిస్తామని కిమ్స్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్య రాజు) తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ అమలాపురం కిమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలో సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. మహాసభల ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన చైతన్య రాజు మాట్లాడుతూ, తెలుగు మహాసభలను జిల్లాలోని కవులు, రచయితలు, మేధావులు, రాజకీయ, ప్రజానాయకులందరూ విజయవంతం చేయాలని కోరారు. సన్నాహక సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకుడు చెల్లుబోయిన శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు అయ్యాజీ వేమా, అయితాబత్తుల ఆనందరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ నాని రాజు, వివిధ సంఘాల నేతలు డీబీ లోక్, మోకా సుబ్బారావు, వాసంశెట్టి సుభాష్, డీవీఎస్ రాజు, పి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ వైపే ప్రజలు

- మండపేట వనసమారాధనకు విశేష స్పందనే అందుకు నిదర్శనం
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు


మండపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం (మండపేట): అన్ని వర్గాల ప్రజలూ వైఎస్సార్ సీపీ వైపే మొగ్గు చూపుతున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండపేటలో ఆదివారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ కార్తిక వనసమారాధనకు విశేష స్పందన లభించడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. మండపేటలో సోమవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అర్హతే ఆధారంగా పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. నియోజకవర్గంలోని మూడు మండలాల నుంచి 60 వేల మంది ప్రజలను ఒకే వేదిక పైకి తీసుకురావడం తన పట్ల ప్రజలకు ఉన్న అభిమానం వల్లనే సాధ్యమైందన్నారు. కార్తిక వన సమారాధనను విజయవంతం చేసిన ప్రజలకు, అందుకు శ్రమించిన పార్టీ శ్రేణులకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కృతజ్ఞతలు తెలిపారు. కుల, ప్రాంతాలకు అతీతంగా తన పిలుపును ప్రజలు ఆదరించడం ఆనందంగా ఉందని అన్నారు. తన రాజకీయ జీవితమంతా ప్రజలతోనే ముడిపడి ఉందని, తనను ప్రజలు ఎప్పుడూ ఆదరిస్తూనే ఉన్నారని అన్నారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర నాయకుడు రెడ్డి రాజుబాబు మాట్లాడుతూ, 60 వేల మందిని ఒకే వేదిక వద్దకు సమీకరించడం మండపేట చరిత్రలోనే తొలిసారి చూస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో వందల మందిని కార్యకర్తలను ఏర్పాటు చేసి, ఎలాంటి అవాంతరాలూ రాకుండా వనసమారాధనను విజయవంతం చేయడం ఎమ్మెల్సీ తోటకే సాధ్యమైందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు పిల్లా వీరబాబు, పెంకే గంగాధర్, పిఠాపురం సత్యనారాయణ, సూరంపూడి ప్రసాద్, పోతంశెట్టి ప్రసాద్, శెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.